క్లుప్తంగా

మురుగు సమస్య పరిష్కారానికి చర్యలు

ఇన్‌చార్జ్ కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు



తెనాలిఅర్బన్: పట్టణంలో మురుగు సమస్య పరిష్కారానికి చర్య తీసుకుంటామని మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు పేర్కొన్నారు. పట్టణంలోని పలు వార్డులలో బుధవారం ఆయన పర్యటించారు. ఆ ప్రాంతాల్లో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తరచూ వర్షాలు పడుతున్న నేపథ్యంలో రోడ్లపై ఎక్కడ నీరు నిలబడకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కాల్వల్లో పూడికతీత పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. ఆయన వెంట పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు



తెనాలిరూరల్: మండల పరిధిలోని పెదరావూరు జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులకు రోటరీ క్లబ్ తెనాలి వైకుంటపురం, ఎల్‌వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ సంయుక్తంగా నేత్ర సంబంధిత క్యాంపును బుధవారం ఏర్పాటు చేశారు. పాఠశాలలోని 350 మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కళ్లజోళ్లు పంపిణీ చేశారు. అలానే విద్యార్థులకు నోటు పుస్తకాలు, పాఠశాలు కుర్చీలను అందజేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షులు ఈదర శ్రీనివాసరావు, పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘ అధ్యక్షులు ఈదర వెంకట పూర్ణ చంద్, పాలడుగు సురేంద్ర, జగన్, స్కూల్ కమిటీ చైర్మన్ వేణు, రోటరీ సభ్యులు మల్లాది అర్జున్, గుమ్మడి ప్రసాద్, షేక్ సలాం, ఉపాధ్యాయులు, ఎల్.వి.ప్రసాద్ ఇనిస్టిస్యూట్ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డులు తప్పనిసరి



కొల్లిపర: కౌలు రైతులు తప్పనిసరిగా సీసీఆర్‌సీ కార్డులు తప్పనిసరిగా తీసుకోవాలని అప్పుడే రైతులకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలకు అర్హత పొందుతారని మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. బుధవారం మండల పరిధిలోని బొమ్మువానిపాలెం కొల్లిపర గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమంలో రైతులతో మాట్లాడుతూ ప్రధానమంత్రి ఫసల్ బీమా కింద వరి మినుము పంటలకు ఇన్సూరెన్స్ చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. కావున ఈ రెండు పంటలు సాగు చేసే రైతులు తప్పనిసరిగా ఇన్సూరెన్స్ చేయించుకోవాలన్నారు. కౌలు రైతులు స్థానిక తహసీల్దార్‌కు అర్జీ సమర్పిస్తే వెంటనే వారికి సీసీఆర్‌సీ కార్డులు అందజేయడం జరుగుతుందన్నారు. ఇంకా ఎవరైనా కౌలు సాగు చేసే రైతులు ఉంటే నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రైతులు వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

వరి విత్తనాలు వినియోగించుకోవాలి

తెనాలిటౌన్: ప్రభుత్వం సబ్సిడీపై రైతు సేవా కేంద్రాల ద్వారా ఇచ్చే వరి విత్తనాలను రైతులు వినియోగించుకోవాలని మండల వ్యవసాయాధికారి కె.సుధీర్‌బాబు సూచించారు. రూరల్ మండలం నందివెలుగు గ్రామంలో బుధవారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సభలో వ్యవసాయాధికారి సుధీర్‌బాబు మాట్లాడుతూ ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద వరి, మినుము పంటలకు ఇన్సూరెన్స్ చేయించుకోవాలని తెలియజేశారు. కౌలు రైతులు ప్రభుత్వం అందిస్తున్న రుణాలు, పథకాలు పొందేందుకు కౌలు రైతు కార్డులు తీసుకోవాలని స్పష్టం చేశారు. భూసార పరీక్షలను అనుసరించి ఎరువుల వినియోగం చేపట్టాలని సూచించారు. రైతు సేవా కేంద్రాల వద్ద సబ్సిడీ పై ఇస్తున్న వరి విత్తనాలను పొందాలని తెలియజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ధూళ్ళిపాళ్ళ పవన్‌కుమార్, ఏఈవో మోహన్, వీఏఏలు మానిక శివసాయి, తేజ, పలువురు రైతులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి ఇద్దరు విద్యార్థులు

చుండూరు(వేమూరు): ట్రిపుల్ ఐటీకి ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.వెంకటేశ్వర్లు తెలిపారు. చుండూరు మండలంలోని మోదుకూరు వేమన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్లు ఆయన బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రావి శ్రావ్య (581) నూజివీడు, సీహెచ్ జితేంద్ర కుమార్(570) ఒంగోలు ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించడం జరిగిందన్నారు. విద్యార్థులను పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

ప్రైవేటు వ్యక్తులకు లీజుకు ఇవ్వొద్దు

'శాప్' నిర్వహణలోనే తెనాలి స్టేడియం నిర్వహించాలంటూ సభ్యుల డిమాండ్



స్టేడియం ఎదుట మాట్లాడుతున్న క్రీడాకారులు

తెనాలి: క్రీడా ప్రాంగణాన్ని వ్యాపార కేంద్రంగా మార్చవద్దని 'స్పోర్ట్స్ అకాడమీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్' (శాప్) ఆధ్వర్యంలోనే నిర్వహణ జరగాలని పలువురు క్రీడాకారులు బుధవారం స్టేడియం ఎదుట ఆందోళన చేశారు. స్థానిక చెంచుపేట అమరావతి ప్లాట్స్ లోని ఇండోర్ స్టేడియం ప్రైవేటు వ్యక్తులకు లీజుకు ఇవ్వడం ద్వారా, క్రీడాకారులకు సరైన వసతులు లేకపోగా, అధిక ఫీజులు వసూలు చేశారని వారు తెలిపారు. క్రీడాకారుల తరపున గణేష్ యూత్ కన్వీనర్ వీరవల్లి మురళి మాట్లాడుతు పద కొండేళ్ల క్రితం సంవత్సరాల క్రితం ఒక్కో సభ్యుడు రూ.5 వేల వంతున చెల్లించి, 200 మంది ఇండోర్ స్టేడియంలో సభ్యులుగా చేరినట్టు తెలిపారు. ప్రైవేటు వ్యక్తులకు లీజుకు ఇచ్చినప్పటి నుంచి ఇండోర్ స్టేడియంలో క్రీడాకారులకు ఇబ్బందులు మొదలయ్యాయని అన్నారు. రూ.500గా ఉన్న ఫీజును రూ.1200లకు పెంచారని తెలిపారు. నిర్వహణ లోపంతో, మౌలిక సదుపాయాలు లోపించాయని, మళ్లీ ఇప్పుడు ఈనెల 27న మళ్లీ ప్రైవేటు వ్యక్తులకు లీజుకిచ్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిసిందన్నారు. ఇండోర్ స్టేడియంలో సభ్యత్వం ఉన్న ఎవ్వరూ దీనిని స్వాగతించరని, ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఇండోర్ స్టేడియం సభ్యులు పాల్గొన్నారు.

28న తెనాలిలో మానవ హక్కుల పరిరక్షణ సదస్సు



కరపత్రం ఆవిష్కరణలో దళిత, ప్రజాసంఘాల నాయకులు

తెనాలి: తెనాలిలో పోలీసుల మానవ హక్కుల ఉల్లంఘనను నిలదీస్తూ ఈనెల 28న సాయంత్రం నాలుగు గంటలకు అయితానగర్లోని శ్రీపొట్టి శ్రీరాములు కమ్యూనిటీ హాలులో జరగనున్న మానవ హక్కుల పరిరక్షణ సదస్సును జయప్రదం చేయాలని దళిత, ప్రజాసంఘాల నేతలు కోరారు. సంబంధిత కరపత్రాన్ని బుధవారం సాయంత్రం ఆవిష్కరించారు. దళిత, మైనారిటీ యువకులపై పోలీసులు బహిరంగ ప్రదేశాల్లో అరికాళ్లపై లాఠీలు విరిగేలా అమానుషంగా దాడిచేసిన ఘటనపై హైకోర్టు సిటింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. చట్ట ఉల్లంఘనకు పాల్పడిన తెనాలి సీఐలు రాముల నాయక్, రమేష్‌బాబు, సిబ్బందిపై కేసులు నమోదుచేసి, వెంటనే అరెస్టు చేయాలని కోరారు. తెనాలి పోలీసులు నడిరోడ్డుపై థర్డ్ డిగ్రీ ప్రయోగించడాన్ని సమర్థించి వారికి వత్తాసు పలికిన గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగంపై ప్రమాణం చేసిన ప్రజాప్రతినిధులు, రాష్ట్ర మంత్రులు, మరీ ముఖ్యంగా హోం మంత్రి, పోలీస్ చట్ట వ్యతిరేక చర్యలను బలపరుస్తూ చేస్తున్న వ్యాఖ్యలపై ఉన్నత న్యాయస్థానాలు, జాతీయ మానవ హక్కుల సంఘం, జాతీయ ఎస్సీ కమిషన్ స్పందించి తగిన చర్యలు చేపట్టాలని కోరారు. ప్రముఖ న్యాయవాది పిల్లి పాల్ రవీంద్ర విద్యాసాగర్, కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆంద్ర మాల్యాద్రి, డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు, రైతు సంఘ నాయకుడు ములకా శివసాంబిరెడ్డి, అంబేద్కరిస్టు రాయిపూడి వెంకటేశ్వరరావు, ప్రగతిశీల కార్మిక సంఘం సమైక్య సభ్యుడు నన్నం పోతురాజు, ది బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా రాష్ట్ర కార్యదర్శి యంద్రపాటి అశోక్ కుమార్, సామాజిక న్యాయవేదిక రాష్ట్ర అధ్యక్షుడు పేరూరి మురళి కుమార్, మాల మహానాడు రాష్ట్ర నాయకులు గద్దటి సుందర్ సునీల్ కుమార్, తుమ్మల ఫ్రాన్సిస్‌రాజు, జాన్ విక్టర్ తండ్రి చేబ్రోలు ఇశ్రాయేలు, దోమ రాకేష్ తండ్రి దోమ వాసు, మాల మహానాడు సోహన్ లాల్, జాకబ్ పాల్గొన్నారు.

పాస్టర్లకు బీమా సౌకర్యం కల్పిస్తాం

పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆవిష్కరణ సభలో నాయకుల వెల్లడి



బిషప్ పరంజ్యోతిని సత్కరిస్తున్న నాయకులు

తెనాలిరూరల్: పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ తెనాలి ఆవిష్కరణ సభ బుధవారం స్థానిక ఐతానగర్ పాడిసన్‌పేట బిషప్ గద్దం థామస్ ప్రాంగణంలో నిర్వహించారు. సభకు పట్టణ వ్యాప్తంగా ఉన్న సుమారు 150 మంది సంఘ కాపరులు హాజరయ్యారు. రెవరెండ్ మల్లవరపు విజయ్ కుమార్ అధ్యక్షతన నిర్వహించిన సభలో ముఖ్య అతిథులుగా బిషప్ కత్తెర సురేష్ కుమార్, బిషప్ పినపాటి జాన్‌పాల్, ఆత్మీయ అతిథులుగా బిషప్ గద్దం జూనియర్ సాధు థామస్, బిషప్ పాముల పరంజ్యోతి, బిషప్ సువర్ణరాజులు హాజరయ్యారు. తొలుత సభలో అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. గౌరవాధ్యక్షులుగా బిషప్ కత్తెర సురేష్ కుమార్, అధ్యక్షులుగా బిషప్ పాముల పరంజ్యోతి, వ్యవస్థాపక అధ్యక్షులుగా బిషప్ పినపాటి జాన్ పాల్, ప్రధాన కార్యదర్శిగా బిషప్ సువర్ణ రాజు, కార్యవర్గ సభ్యుల ఎన్నిక జరిగింది.

బిషప్ కత్తెర సురేష్ కుమార్ మాట్లాడుతూ పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ తెనాలి ఆవిర్భావం శుభపరిణామమని, ప్రేమ దయ క్షమా దాతృత్వ గుణాలు కలిగి సభ్యులందరం సమిష్టి నిర్ణయాలతో ముందుకు సాగుదామన్నారు. వ్యవస్థాపక అధ్యక్షులు బిషప్ పినపాటి జాన్ పాల్ మాట్లాడుతూ తాను గతంలో అసోసియేషన్ అధ్యక్షులుగా పనిచేయడం జరిగిందని, కొన్ని ప్రత్యేక పరిస్థితులలో బిషప్ కత్తెర సురేష్ కుమార్ సహచర్యంలో అసోసియేషన్ ఏర్పాటు వేగవంతంగా జరిగిందన్నారు. అసోసియేషన్ పాస్టర్ల సంక్షేమానికి అధిక ప్రాధాన్యతనిస్తుందన్నారు. అసోసియేషన్ సభ్యులైన పాస్టర్లకు బీమా సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు. ఉపాధ్యక్షులు గద్దం సాధుథామస్ జూనియర్ మాట్లాడుతూ పట్టణంలో దైవ సేవకులు అందరూ ఐక్యతతో ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. గద్దం సాధు థామస్ దంపతుల కుమార్తె అక్షరాభ్యాస కార్యక్రమాన్ని కత్తెర సురేష్ చేతుల మీదుగా చేయించారు.

కార్యక్రమంలో పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ తెనాలి (పాట్) జాయింట్ సెక్రటరీ రెవ. రావూరి విక్టర్‌పాల్, వర్కింగ్ సెక్రటరీ రెవ. మల్లవరపు విజయ్ కుమార్, ట్రెజరర్ రెవ.విలియం కేరీ, జాయింట్ ట్రెజరర్ రెవ. అన్నం ఆదాము, సభ్యులు రెవ. గద్దం జాన్‌బాబు, పాస్టర్ షడ్రక్, రెవ.భాగ్యరాజు, రెవ.జాన్ వర ప్రసాద్, మాస్ వ్యవస్థాపక అధ్యక్షుడు సుద్దపల్లి నాగ రాజు, పెద్ద ఎత్తున దైవ సేవకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధ్యక్షులుగా ఎన్నికైన పాముల పరంజ్యోతిని అతిథులు సత్కరించారు.

సేవానిరతితో మానవజన్మ చరితార్థం

గాంధీ హృదయదారి వజ్రాల రామలింగాచారి



తెనాలిటౌన్: సేవానిరతితో మానవజన్మ చరితార్థమవుతుందని గాంధీ హృదయదారి వజ్రాల రామలింగాచారి పేర్కొన్నారు. బుర్రిపాలెం రోడ్డులోని శ్రీ మహాత్మా సేవా శాంతి ఆశ్రమంలో బుధవారం వృద్ధులకు అన్నదానం నిర్వహించారు. ఆశ్రమ ధర్మదాత డాక్టర్ చిలుకూరి రేఖ జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు సేవా కార్యక్రమం నిర్వహించారు. అదే విధంగా దుగ్గిరాల మండలం మంచికలపూడి గ్రామానికి చెందిన మంచికలపూడి రాఘవులు, మహాలక్ష్మి జ్ఞాపకార్థం వారి కుమారుడు వెంకటేశ్వర రావు, కోడలు విజయ వృద్ధులకు సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ్రమ నిర్వాహకులు రామలింగాచారి మాట్లాడుతూ ధర్మదాతలు కోరిన విధంగా అమావాస్య రోజు వృద్ధులకు భోజనం ఏర్పాటు చేయడం వంటి సేవా కార్యక్రమాలకు ఆదర్శంగా ఆశ్రమ నిలుస్తుందని చెప్పారు. కార్యక్రమంలో వై.కోటేశ్వరరావు, ఆశ్రమ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యభిచార నిర్వాహకుల అరెస్ట్

తెనాలిరూరల్: తెనాలి మండలం మల్లెపాడు గ్రామంలో వ్యభిచారం నిర్వహిస్తున్న ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. నర్సరావుపేటకు చెందిన ఓ మహిళను రక్షించి, విటుడిపైనా కేసు నమోదు చేశారు. త్రీ టౌన్ సీఐ ఎస్. రమేష్ బాబు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని మల్లెపాడు పరిధిలోని ద్వారకానగర్‌లోని ఓ ఇంట్లో వ్యభిచారం జరుగుతోందన్న సమాచారంతో పోలీసులు బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. బాపట్ల జిల్లా అమృతలూరు మండలం పెదపూడికి చెందిన వ్యక్తి, తెనాలి ముత్తెంశెట్టిపాలెంకు చెందిన ఓ మహిళ ఇల్లు అద్దెకు తీసుకుని వ్యభిచారం నిర్వహిస్తున్నట్టు గుర్తించారు. నర్సరావుపేటకు చెందిన మహిళ, తెనాలికి చెందిన విటుడిని అదుపులోకి తీసుకున్నారు. వీరిని కోర్టులో హాజరుపరచనున్నట్టు సీఐ తెలిపారు.

ప్రజాస్వామ్య పరిరక్షణకు యువత నడుం బిగించాలి

బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి టి.అనంతాచార్యులు



సభలో మాట్లాడుతున్న అనంతాచార్యులు

తెనాలిటౌన్: ప్రజాస్వామ్య పరిరక్షణకు యువత ముందుకు రావాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి టి.అనంతాచార్యులు పిలుపునిచ్చారు. దేశంలో ఎమర్జెన్సీ విధించి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా స్థానిక వీఎస్సార్ కళాశాల ఎదురుగా గల బండ్‌పై రామాచార్యులు విగ్రహానికి పార్టీనేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బస్టాండ్ వద్ద గల ఎస్ఆర్‌కె అండ్ కెఎస్ఆర్ గుప్తా డిగ్రీ కళాశాల ప్రాంగణంలో సదస్సు నిర్వహించారు. సభకు పార్టీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు అధ్యక్షత వహించారు. పార్టీ జిల్లా అధికార ప్రతినిధి టి.అనంతాచార్యులు మాట్లాడుతూ ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం ఏకపక్ష నిర్ణయాలతో ఎమర్జెన్సీ విధించి చట్టానికి వ్యతిరేకంగా వ్యవహరించారని నాటి ప్రధాని ఇందిరాగాంధీ చర్యలను తప్పుపట్టారు. కాంగ్రెస్ నిరాకుశ చర్యలను నిరాసిస్తూ దేశం కోసం జాతీయస్థాయిలో చేపట్టిన ఉద్యమాలను యువతకు తెలియజేశారు. ఎమర్జెన్సీ సమయంలో అనేక పోరాటాలు చేసి తమ జీవితాన్ని అంకితం చేసిన టి.రామాచార్యులు, లక్కరాజు రఘునాధరావు, మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు, రాజ్యసభ మాజీ సభ్యులు యలమంచిలి శివాజీ, మాజీ ఎమ్మెల్సీ యజ్ఞ నారాయణ వంటి ప్రముఖల త్యాగాలను, వారు చేసిన సేవలను వివరించారు. యువతీ యువకులు పటిష్టమైన వ్యవస్థ నడిపేందుకు సమాజంలో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్రవర్గ సభ్యురాలు యడ్లపాటి స్వరూపరాణి, తెనాలి అసెంబ్లీ కన్వీనర్ కఠారి వాసుదేవ నాయుడు, కళాశాల ప్రిన్సిపల్ గోగినేని విజయకృష్ణ, బీజేపీ నాయకులు కడియాల నందకిషోర్, సందీప్‌రాజు, మురళి, అన్నవరపు వేణుగోపాల్, అడపా సంపత్‌రాయుడు, బిట్రా కనకదుర్గ, అడుసుమల్లి సుధాకర్, యర్రంశెట్టి హనుమంతరావు, తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల అనర్థాలపై అవగాహన ర్యాలీ



ర్యాలీలో సీఐ మల్లికార్జునరావు, పోలీసులు, విద్యార్థులు

తెనాలిరూరల్: సమాజంలో అశాంతి నెలకొనడంలో మాదక ద్రవ్యాల వినియోగం ప్రధాన కారణాల్లో ఒకటని తెనాలి వన్‌టౌన్ సీఐ వి. మల్లికార్జున రావు పేర్కొన్నారు. నషా ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా పోలీసులు పట్టణంలో ర్యాలీని బుధవారం నిర్వహించారు. మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ నుంచి శివాజీచౌక్, గాంధీచౌక్‌ల మీదుగా బోస్ రోడ్డులోని డైమండ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి, విద్యార్థులతో మానవ హారం ఏర్పాటు చేయించారు. మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం సీఐ మాట్లాడుతూ యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటూ లక్ష్యసాధనకు కృషి చేయాలని సూచించారు. నిషేధిత మాదక ద్రవ్యాల రవాణా, వినియోగంపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిషేధిత మాదక ద్రవ్యాల గురించిన సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని చెప్పారు. మానవ అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రతి ఒక్కరు అధికారులకు సహకరించాలన్నారు. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలు, అక్రమ రవాణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వన్ టౌన్ ఎస్ఐ రాజ్యలక్ష్మి, ఏఎస్ఐ రఘు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు మధ్యలో చెట్లు



స్థానిక బాలాజీరావు పేటలో చక్రవర్తి స్కూల్ వీధిలో రోడ్డు మధ్యలో చెట్లు ప్రజాజీవనానికి అసౌకర్యంగా ఉన్నాయి. ఎప్పుడో నాటిన మామిడి చెట్లు భారీగా పెరిగిపోయాయి. వాటిని అలాగే ఉంచి రోడ్డు నిర్మాణం చేశారు. దీంతో ఆ రోడ్డులో వాహనాల రాకపోకలు కష్టసాధ్యంగా మారాయి. అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్ కూడా రాలేని పరిస్థితి. విద్యుత్ తీగెలకు అడ్డుగా కొమ్మలు వస్తున్నాయి. చెట్ల నుండి రాలిపడే ఆకులతో వీధి మొత్తం చెత్తాచెదారంతో అపరిశుభ్రంగా ఉంటోంది. మురుగుకాల్వలూ ఆకులతో నిండిపోతున్నాయి. మామిడి చెట్ల నుంచి వచ్చే ఫలసాయం కోసం అక్కడి స్థానికుల్లో వాగ్వాదాలు జరుగుతున్నాయి. వాటిని తొలగించి మార్జినులో కొత్తగా మొక్కలు నాటడం, లేదా ట్రాన్స్‌లోకేషన్‌తో ఆయా చెట్లను ఇతర ప్రదేశాల్లో తరలించడం చేయాలని పలువురు కోరుతున్నారు.

– తెనాలి

నూరుశాతం గుర్తింపు కార్డులు అందజేయాలి

తహసీల్దార్ శ్రీనివాసరావు



రెవెన్యూ, వ్యవసాయ శాఖ సిబ్బందికి సూచనలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసరావు

రేపల్లె: కౌలు రైతులకు నూరు శాతం గుర్తింపు కార్డులు అందజేసేలా రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు సమన్వయంగా పనిచేయాలని తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో కౌలు గుర్తింపు కార్డుల జారీపై రెవెన్యూ, వ్యవసాయ సహాయకులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కౌలు గుర్తింపు కార్డు కలిగిన రైతులకు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. కౌలు గుర్తింపు కార్డు పొందటంతో పొలం యజమానికి ఎటువంటి నష్టం వాటిల్లదన్న అంశంపై భూ యజమానులకు అవగాహన కల్పించాలని సూచించారు. మండలంలో 6,550 మంది కౌలు రైతులకు గుర్తింపు కార్డులు అందించాల్సి ఉండగా నేటి వరకు 777 మంది నుంచి మాత్రమే దరఖాస్తులు అందాయన్నారు. ప్రతి కౌలు రైతు కౌలు గుర్తింపు కార్డుకు దరఖాస్తు చేసుకునేలా పనిచేయాలన్నారు. అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్, ఇన్‌పుట్ సబ్సిడీ తదితర పథకాలు పొందేందుకు గుర్తింపు కార్డు ఉండాలని లేకపోతే పథకాలు వర్తించవని చెప్పారు. సమావేశంలో ఏవో అవ్వారు మహేష్, రెవెన్యూ అధికారులు, వ్యవసాయ సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం కార్మికుల సమస్యను విస్మరించింది



కార్మికులకు మద్దతు తెలియజేస్తున్న నాయకులు

తాడేపల్లి రూరల్: 32 ఏళ్లుగా ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్య పరిష్కారం కాలేదని సీఐటీయూ నాయకులు వేముల దుర్గారావు అన్నారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఏసీసీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షలు బుధవారంతో 204వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా దుర్గారావు, యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్‌లు దీక్షా శిబిరాన్ని సందర్శించి కార్మికులకు మద్దతు తెలియజేసి మాట్లాడారు. ప్రభుత్వం కార్మికుల సమస్యను విస్మరించిందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆశీర్వాదం, బి.సూర్యప్రకాశరావు, ఇస్మాయిల్, సుభాని, నాగేశ్వరరావు, కార్మికులు హగ్గయ్య, శారద, రమణమ్మ, సువర్ణకుమారి, కాసమ్మ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

తాడికొండ: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన తుళ్లూరు మండలం లింగాయపాలెంలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లింగాయపాలెం సమీపంలో సీఆర్‌డీఏ కార్యాలయం ఎదుట ఈ ప్రమాదం జరిగింది. విజయనగరం జిల్లాకు చెందిన గణేష్ (35) అనే వ్యక్తి నడుచుకుంటూ వస్తుండగా వెనుక నుంచి బొలేరో వాహనం ఢీకొంది. ప్రమాదంలో గణేష్ తీవ్రగాయాల పాలయ్యాడు. గమనించిన స్థానికులు వెంటనే మంగళగిరి ఎయిమ్స్ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుని బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తుళ్లూరు పోలీసులు తెలిపారు.

మలేరియా నివారణపై అవగాహన



వేమూరు: మలేరియా నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.రమాదేవి అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మలేరియా నివారణ మాసోత్సవాలలో భాగంగా విద్యార్థులకు బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మలేరియా జ్వరాలు వ్యాపించకుండా పలు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు మానవహారంగా ఏర్పడి మలేరియా నివారణపై ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి పున్నారావు, వంగల పున్నా రెడ్డి, కంఠ ఉమాకాంత్, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామస్తులు ఐకమత్యంగా ఉండాలి

ఎస్ఐ శివకుమార్‌యాదవ్



పిట్టలవానిపాలెం(కర్లపాలెం): గ్రామస్తులందరూ ఐకమత్యంగా ఉండాలని చందోలు ఎస్ఐ ఎంవీ శివకుమార్ యాదవ్ చెప్పారు. బుధవారం పిట్టలవానిపాలెం మండల పరిధిలోని పుచ్చకుర్తివారిపాలెంను ఎస్ఐ శివకుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామస్తులతో మాట్లాడుతూ అందరూ తమ పిల్లలను చక్కగా చదివించుకోవాలని, మైనర్ బాలురకు వాహనాలు ఇవ్వవద్దని తెలిపారు. ద్విచక్ర వాహనాల మీద ప్రయాణించే వారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని చెప్పారు. గ్రామాలలోకి ఎవరైనా కొత్త వ్యక్తులు వస్తే పోలీసులకు తెలియజేయాలన్నారు.

జగనన్న కాలనీలో సమస్యలు పరిష్కరించండి

సీపీఎం పట్టణ కార్యదర్శి మణిలాల్



జగనన్న కాలనీవాసులతో మాట్లాడుతున్న మణిలాల్

రేపల్లె: జగనన్న కాలనీలో నెలకొన్న సమస్యలపై పాలక ప్రభుత్వాలు, అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరించటం తగదని సీపీఎం పట్టణ కార్యదర్శి మణిలాల్ హెచ్చరించారు. పట్టణంలోని 18వ వార్డు జగనన్న కాలనీలో సీపీఎం బృందం బుధవారం పర్యటించి కాలనీవాసుల సమస్యలు తెలుసుకుంది. కాలనీలో సమస్యలను పరిష్కరించాలని ఇప్పటికే పలుమార్లు పాలకులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకపోయిందన్నారు. నెలరోజులుగా కాలనీలో కనీసం బజారు విద్యుత్ లైట్‌లు వెలగకపోవటంతో వాహన చోదకులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారని, రాత్రి సమయంలో పాముల బెడదతో భయభ్రాంతులకు గురవుతున్నారని, తాగునీటి సమస్య తాండవిస్తోందని చెప్పారు. కాలనీ అభివృద్ధికై రూ.35 కోట్లతో ప్రతిపాదనలు పంపామని చెబుతున్నా, ఆ ప్రతిపాదనలు కాగితాలకే పరిమితమవుతున్నట్లు తెలుస్తోందన్నారు. పాలకులు, అధికారుల్లో చిత్తశుద్ధి ఉంటే వెంటనే సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు.

సమస్యల సాధనకై మున్సిపల్ కార్యాలయం ఎదుట ఈ నెల 30వ తేదీన నిర్వహించే నిరసన కార్యక్రమంలో కాలనీవాసులు అధిక సంఖ్యలో హాజరై తమ సమస్యలు పరిష్కరించుకోవాలని పిలుపునిచ్చారు. సమావేశంలో కాలనీ అభివృద్ధి కమిటీ కన్వీనర్ వి.ధనమ్మ, కమిటీ సభ్యులు దుర్గాదేవి, శ్రీనివాసరావు, కె.వీరాంజనేయులు, సుధాదేవి, షేక్ గౌసే తదితరులు పాల్గొన్నారు.

మండలంలో 16.4 మి.మీ. వర్షపాతం

దుగ్గిరాల: దుగ్గిరాల మండలంలో మంగళవారం రాత్రి ఓ మోస్తరు వర్షం కురిసింది. మండలంలో 16.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైందని దుగ్గిరాల తహసీల్దార్ కార్యాలయం నుంచి అధికారులు వర్షమాపిని ద్వారా నమోదైన వివరాలను బుధవారం వెల్లడించారు.